జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

NIZAMABAD EDITION

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ 19 గురువారం, నవంబర్ 2026 సంపుటి:16 సంచిక :287 వెల:రూ.1/- పేజీలు : 08

RNI No. TELTEL/2010/35558



Published from NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

ఎంపీ పీ.ఏ నియామకంపై రాజకీయ వర్గాల్లో చర్చ

కామారెడ్డి జిల్లాకు ప్రాధాన్యతపై హర్షం..

రాజకీయ వ్యూహంలో భాగమేనంటూ మరో వాదన

గాంధారి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ తన వ్యక్తిగత సహాయకుడిగా (పీఏ) కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సీతాయిపల్లికి చెందిన రేపని భాస్కర్‌ను నియమించుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఈ నియామకంపై కాంగ్రెస్ శ్రేణులు, యూత్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తుండగా.. మరోవైపు రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు చేరువ కావడమే లక్ష్యమా? లేక జిల్లాలో పార్టీ పట్టు పెంచుకునే వ్యూహమా? అన్న చర్చ సాగుతోంది.కామారెడ్డి జిల్లా ప్రజలు, పార్టీ కార్యకర్తలకు ఎంపీ ఎల్లవేళలా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే స్థానికుడైన భాస్కర్‌కు పీఏ బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీ అనుచర వర్గాలు పేర్కొంటున్నాయి.



మిగతా 2 లో

గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులపై ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

సర్పంచులు, గ్రామస్తులు కలిసికట్టుగా వాటి నిర్మూలనకు కృషి చేయాలని పిలుపు

రబీ వరి పంటలకు నిజాంసాగర్ నుంచి సాగునీరు అందిస్తామని భరోసా.

బెల్ట్ షాపులు మూసివేస్తేనే గ్రామాలకు నిధులు..

రైతులకు సాగునీరు అందిస్తా!

బెల్ట్ షాపుల నిర్మూలనకు గ్రామస్తులు సహకరించాలి

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



అంగన్‌వాడీ భవనానికి ముగ్గు

- గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం

- కోటాల్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దే కార్యక్రమం.

- పాల్గొన్న సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు

కామారెడ్డి రూరల్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

గ్రామాభివృద్ధిలో భాగంగా చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కోటాల్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ భవనానికి ముగ్గు వేసి అందంగా తీర్చిదిద్దే కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా ఉండేలా గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. చిన్నారులకు పరిశుభ్రమైన, సుందరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామంలో ఉత్సాహాన్ని నింపింది.



మిగతా 2 లో

విదేశీ రాజకీయ ప్రతినిధిపై చర్యలు తీసుకోవాలి

- భారత్ సమ్మిట్ పేరుతో చట్టపరమైన ఉల్లంఘన

- పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి) :



ఇటీవల హైదరాబాద్ లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భారత్ సమ్మిట్ లో విదేశీ రాజకీయ నాయకుడు జియోకోమో ఫిలిటిక్ చట్టాన్ని ఉల్లంఘించి మాట్లాడారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విదేశీయుడైన జియోకోమో తన ప్రసంగంతో వీసా నిబంధనలు, ఇమ్మిగ్రేషన్ చట్టాల ఉల్లంఘనకు పాల్పడ్డారని తెలిపారు. కావున పూర్తి విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన సదస్సులో ప్రసంగిస్తూ " ఓటు చోర్.. గద్దీ చోడ్" అనే నినాదం చేసి, భారత అంతర్గత వ్యవహారాలను బహిరంగంగా చెప్పడం తగదన్నారు. ఇందుకు రాహుల్ గాంధీ తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవ్వడం సిగ్గుచేటని పేర్కొన్నారు.దేశంలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సులు, సెమినార్లు, వర్క్ షాప్ లు ఇతర కార్యక్రమాలు నిర్వహించినప్పుడు విదేశీ ప్రతినిధులు దేశ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని గుర్తు చేశారు. అలాగే ప్రత్యేక పొలిటికల్ క్లియరెన్స్ ఇస్తుందన్నారు. కానీ వీటన్నిటి ఉల్లంఘిస్తూ ప్రసంగం చేయడం దేశ పౌరులను అవమానించడమేనన్నారు. కావున ఈ ఉల్లంఘనలను పరిగణలోకి తీసుకొని తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



281 మందికి చేయూత పింఛన్ల పంపిణీ

లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

కామారెడ్డి రూరల్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. బుధవారం కామారెడ్డి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు.



మిగతా 2 లో

నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంజూరు

ప్రజా జ్యోతి,లింగంపేట నవంబర్ 18



లింగంపేట: మండలంలోని భవానీపేట గ్రామానికి నూతనంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో భవానీపేట గ్రామ రైతులకు వ్యవసాయ సహకార సేవలు మరింత చేరువ కానున్నాయి.గ్రామానికి నూతన సహకార సంఘం మంజూరు కావడంపై గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు గ్రామ ప్రజలు, రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చలో సిద్దిపేట సభను విజయవంతం చేయాలి

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

సన్నాహక సమావేశంలో షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మదుసూదన్

కామారెడ్డి జిల్లా, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

సిద్దిపేటలో ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సన్నద్ధమవుతున్నారు. ఈ సభలో దేశంలోనే తొలిసారిగా ప్రారంభించనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు.

మిగతా 2 లో

మొదటిపేజీ తరువాయి

అంగన్‌వాడీ భవనానికి ముగ్గు

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల శ్యామ్ కుమార్, ఉప సర్పంచ్ గోపాల్, వార్డు సభ్యులు గంగయ్య, లత, బాలయ్య, గీత, రమేష్, అంగన్‌వాడీ టీచర్ సురేఖ, పంచాయతీ కార్యదర్శి దేవలక్ష్మి, గ్రామ పాలన అధికారి అశోక్, కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.అలాగే గ్రామ ప్రజలు రాజయ్య, దర్శనం, లింగం, రాజు, రాజలింగం, లింగం, రాజయ్య, సిద్ధ రాములు, శంకర్, హరి శంకర్, చిరంజీవి, నర్సింలు, వీవో అధ్యక్షురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కలిసికట్టుగా ముందుకు రావడం అభినందనీయమని, చిన్నారుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని గ్రామస్థులు పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

281 మందికి చేయూత పింఛన్ల పంపిణీ

ఈ సందర్భంగా కామారెడ్డి మండలానికి మంజూరైన మొత్తం 281 మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేపట్టారు. ప్రభుత్వం పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పీఏసీఎస్ చైర్మన్ గూడెం కామారెడ్డి ఎంపీడీవో హెప్సీబా రాణి ఎంపీ ఓ త్రివేద్ కామారెడ్డి మండల అధికారులు భక్తియార్ అరవింద్ తేజ కామారెడ్డి మండలంలోని 14 గ్రామ పంచాయతీల సర్పంచులు సెక్రటరీలు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి రాజగౌడ్, సర్పంచులు, రాంకుమార్, మండల అధ్యక్షులు రాజగౌడ్, ప్రవీణ్, సుదర్శన్, రవితేజ గౌడ్, భూమని బాలరాజు, మహేష్ గౌడ్, సీతారాం, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



233 మందికి పింఛన్ల పంపిణీ

-- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

కామారెడ్డి నియోజకవర్గంలోని పాల్వంచ రైతు వేదికలో బుధవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మొత్తం 233 మంది లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ సర్పంచ్ శేఖర్ మండల అధ్యక్షులు రమేష్ గౌడ్, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.



తెలంగాణలోనే అత్యధిక పింఛన్లు అందిస్తున్నాం: పోచారం

చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

చందూర్ ప్రజా జ్యోతి నవంబర్ 19.

చందూర్ మండల కేంద్రం లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం చందూర్ మండల కేంద్రంలో 143 మంది నూతన పింఛన్ లబ్ధిదారులకు చేయూత పింఛన్ మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఇందులో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధికంగా పింఛన్లు అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని, మద్యం విక్రయాల వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. సర్పంచులు, గ్రామ పెద్దలు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పనిచేసి బెల్ట్ షాపుల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.రైతులు భూగర్భ జలాలు, బోరుబావుల ద్వారా సాగునీటి సదుపాయం ఉన్నచోట రబీ పంటలు సాగు చేసుకోవచ్చని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే లబ్ధిదారులు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబు, ఎంపీడీవో నీలావతి, తహసీల్దార్ వీరాసింగ్, డీడీసీసీ స్పెషల్ ఆఫీసర్ రజిత,ఎంపీవో శ్రీనివాస్ చారి , సర్పంచ్ మద్దూరి మాధవరెడ్డి,చింతం ఉమా రాణి సంజు లాల్ సింగ్ వివిధ గ్రామ ల సర్పంచ్ లు ఉపసర్పంచ్ సురేఖ సాయిలు, సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్,మాజీ సర్పంచ్ కర్లం సాయి రెడ్డి సీనియర్ నాయకులు సాయగౌడ్ కాంగ్రెస్ అధ్యక్షులు పోతరాజ్ శ్రీనివాస్ వార్డు మెంబర్లు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

ఎంపీ పీ.ఏ నియామకంపై రాజకీయ వర్గాల్లో చర్చ

కామారెడ్డి జిల్లాకు ప్రాధాన్యతపై హర్షం..

రాజకీయ వ్యూహంలో భాగమేనంటూ మరో వాదన

ప్రజలకు చేరువ కావడమే లక్ష్యమా? లేక జిల్లాలో పార్టీ పట్టు పెంచుకునే వ్యూహమా? అన్న చర్చ సాగుతోంది.కామారెడ్డి జిల్లా ప్రజలు, పార్టీ కార్యకర్తలకు ఎంపీ ఎల్లవేళలా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే స్థానికుడైన భాస్కర్‌కు పీఏ బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీ అనుచర వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లా ప్రజలకు, ఎంపీకి మధ్య సమన్వయం పెరగడంతోపాటు ప్రజా సమస్యలు నేరుగా ఎంపీ దృష్టికి వెళ్లేందుకు ఈ నియామకం దోహదపడుతుందని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు కామారెడ్డి జిల్లాలో రాజకీయంగా పట్టు సాధించడంతోపాటు పార్టీ క్యాడర్‌ను బలోపేతం చేసుకునే వ్యూహంలో భాగంగానే ఈ నియామకం జరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక వ్యక్తికి కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా జిల్లాలో పార్టీ కార్యకలాపాలను విస్తరించుకోవచ్చని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. 2008లో ఏర్పాటైన జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నారాయణఖేడ్, ఆందోల్, జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2009, 2014, 2019, 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి సురేష్ షెట్కర్, బీఆర్ఎస్ నుంచి బీబీ పాటిల్ రెండేసి పర్యాయాలు విజయం సాధించారు. గతంలో కామారెడ్డి జిల్లాకు చెందిన యూసఫ్ అలీ, ప్రస్తుత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఎంపీగా పోటీ చేసినప్పటికీ విజయం వరించలేదు.దీంతో సుమారు రెండు దశాబ్దాలుగా సంగారెడ్డి జిల్లా పరిధిలోని నారాయణఖేడ్ ప్రాంత నాయకులే ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారన్న



అభిప్రాయం స్థానికంగా ఉంది. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంపీతో ప్రత్యక్ష సంబంధాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని, సామాన్యులకు ఎంపీ అందుబాటుపై గతంలోనూ చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో స్థానికుడికి పీఏగా అవకాశం కల్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది.రేపని భాస్కర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రం, పొలిటికల్ సైన్స్, ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్హతలు పొందారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ గురుకులాల కార్యదర్శి నవీన్ నికోలస్ (ఐఏఎస్) వద్ద ఓఎస్‌డీగా పనిచేసిన అనుభవం ఉంది. ఈ అనుభవంతో సచివాలయ స్థాయిలో ప్రభుత్వ శాఖలతోపాటు జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని స్థానిక నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.పీఏ నియామకం తర్వాత కామారెడ్డి జిల్లా ప్రజలకు ఎంపీ



మరింత చేరువయ్యారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నియామకంతో ఎంపీ సురేష్ షెట్కర్ గ్రాఫ్ పెరిగిందని పలువురు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివిధ మండలాల నుంచి ప్రజలు హైదరాబాద్‌లో ఎంపీని కలిసి తమ సమస్యలను వివరించడంతోపాటు గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు అందిస్తున్నట్లు అనుచర వర్గాలు చెబుతున్నాయి. ఆయా ప్రతిపాదనలపై ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటున్నారని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు మార్గం సుగమం అవుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. దీంతో పీఏ నియామకం కామారెడ్డి జిల్లా రాజకీయాలతోపాటు అభివృద్ధి పరంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది.

మొదటిపేజీ తరువాయి

గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులపై ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

నస్రుల్లాబాద్, నవంబర్ 18(ప్రజాజ్యోతి):

గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న మద్యం బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేస్తేనే ఆయా గ్రామాలకు అవసరమైన అభివృద్ధి నిధులు మంజూరు చేస్తానని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామ సర్పంచులు, గ్రామ పెద్దలు, ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఏకమై బెల్ట్ షాపుల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.బుధవారం నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో గ్రామంలో 10 నుంచి 20 వరకు బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఎప్పుడంటే అప్పుడు మద్యం అందుబాటులో ఉండటంతో అనేక కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాని అన్నారు.మద్యానికి బానిసై చిన్న వయసులోనే పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని, దీంతో వారి కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల చేయూత పింఛన్ల పంపిణీ సందర్భంగా భర్తలను కోల్పోయిన పలువురు మహిళల బాధలు తన దృష్టికి వచ్చాయని గుర్తుచేశారు. మద్యపాన వ్యసనం కారణంగా కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు బాధాకరమని అన్నారు.అధికారిక మద్యం దుకాణాల కంటే గ్రామాల్లో బెల్ట్ షాపుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఉక్కుపాదం మోపాలని, అక్రమంగా నిర్వహించే షాపులపై దాడులు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతులకు సాగునీటి భరోసా

రబీ సీజన్‌లో నీటి లభ్యత, విద్యుత్ సరఫరా సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందుచూపుతో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని పోచారం సూచించారు. నీటి లభ్యతను బట్టి వరి సాగు చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే వరి సాగు చేసిన రైతుల పంటలకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీరు అందిస్తానని భరోసా ఇచ్చారు.తాను గత 40 ఏళ్లుగా బాన్సువాడ నియోజకవర్గ రైతులు, గ్రామస్తులతో కలిసి పనిచేస్తున్నానని, వారి సమస్యలు, కష్టనష్టాలు తనకు పూర్తిగా తెలుసునని అన్నారు. సాగునీటి విషయంలో కొందరు చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. రైతుల సంక్షేమమే తన లక్ష్యమని, రైతుల కష్టాల్లో ఎప్పుడూ అండగా ఉంటానని ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

మొదటిపేజీ తరువాయి

చలో సిద్దిపేట సభను విజయవంతం చేయాలి

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

సన్నాహక సమావేశంలో షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మధుసూదన్

కామారెడ్డి జిల్లా, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

సిద్దిపేటలో ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సన్నద్ధమవుతున్నారు. ఈ సభలో దేశంలోనే తొలిసారిగా ప్రారంభించనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు.చలో సిద్దిపేట సభ ఏర్పాట్లపై కామారెడ్డి నియోజకవర్గ ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ పాల్గొని మాట్లాడారు. సభకు కామారెడ్డి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేలా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా సభకు తరలించే వాహనాల వివరాలు, ప్రజల ప్రయాణ సౌకర్యాలు, పార్కింగ్ ఏర్పాట్లు, వివిధ ప్రాంతాల నుంచి ప్రజలను సమన్వయంతో తరలించే అంశాలపై నాయకులతో చర్చించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో బాధ్యతలను నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.దేశంలోనే తొలిసారిగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రాష్ట్ర ప్రజలకు ఎంతో ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని పేర్కొంటూ, ఈ పథకం ఉద్దేశం, ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. చలో సిద్దిపేట సభను విజయవంతం చేయడంలో ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.సభకు సంబంధించిన సన్నాహక సమావేశంలో నియోజకవర్గ నాయకులు పాల్గొని తరలింపు, ఏర్పాట్లపై చర్చించారు.





ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా

ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

లింగాయపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం

కామారెడ్డి రూరల్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం, ఆపదలో ఉన్న వారికి ధైర్యం చెప్పడం నిజమైన ప్రజాసేవకు నిదర్శనమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కుటుంబంలో చోటుచేసుకున్న విషాదంతో బాధలో ఉన్న వారిని స్వయంగా పరామర్శించి, వారికి భరోసా కల్పించారు. కామారెడ్డి మండలం లింగాయపల్లి గ్రామానికి చెందిన సోమిశెట్టి మల్లేశం కుటుంబంలో ఇటీవల ప్రమాదవశాత్తు సోమిశెట్టి రజిత మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ కష్టకాలంలో అధైర్యపడవద్దని, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం



అందించారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ ఆపద సమయంలో అండగా నిలవడం గొప్ప నాయకత్వ లక్షణమని పలువురు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి, ఆర్థికంగా చేయూతనివ్వడం అభినందనీయ మన్నారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ పరామర్శ కార్యక్రమంలో లింగాయపల్లి ఉప సర్పంచ్ శిరీష భూపతి, బీజేపీ మండల అధ్యక్షుడు చందన శ్రీధర్, మండల ప్రధాన కార్యదర్శి, గ్రామ అధ్యక్షుడు కల్లూరి మహిపాల్, బీజేపీ ఆరో వార్డు సభ్యుడు పెద్దపల్లి స్వామి తదితర నాయకులు పాల్గొన్నారు.

అటవీ భూమిలో అక్రమ మొరం తవ్వకాలపై కేసు నమోదు - రూ.9,945 జరిమానా

ఇందల్వాయి, నవంబర్ 18,(ప్రజా జ్యోతి):

అటవీ భూమిలో అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలు జరిపిన వ్యక్తిపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేసి జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే.. ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ భట్ ఆదేశాల మేరకు, బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఇందల్వాయి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పి. ప్రభాకర్, గన్నారం బీట్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ ఎల్. వందన కలిసి ఇందల్వాయి మండలం తిరుమలయా తండా గ్రామ పరిధిలోని గన్నారం బీట్ (కంపార్ట్‌మెంట్ నెం. 451/1) అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తిరుమలయా తండాకు చెందిన దేవత్ గంగారం (తండ్రి: పోయ్) అటవీ భూమిలో సుమారు 1.46 ఘన మీటర్ల మొరం (విలువ రూ.1,989) అక్రమంగా తవ్వి తరలించినట్లు అధికారులు గుర్తించారు. అటవీ భూమిలో అనధికారికంగా మొరం తవ్వడం చట్టరీత్యా నేరమని హెచ్చరిస్తూ, తెలంగాణ అటవీ చట్టం-1967 మరియు సంబంధిత నిబంధనల ప్రకారం సదరు వ్యక్తికి రూ.9,945 జరిమానా విధించారు. జిల్లా అటవీ అధికారి (డి ఎఫ్ ఓ), ఫారెస్ట్ డివిజనల్ అధికారి (ఎఫ్ డి ఓ), ఇందల్వాయి రేంజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

అధికారుల హెచ్చరిక:

మండల పరిధిలో ఎవరైనా అక్రమంగా చెట్లను నరికినా, అటవీ భూములకు నష్టం కలిగించినా లేదా వన్యప్రాణులకు హాని తలపెట్టినా అటవీ, వన్యప్రాణి సంరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హెచ్చరించారు.



అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణకు ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎర్గట్ల లో అక్రమంగా తరలిస్తున్న ఆరు కలప ట్రాక్టర్లు పట్టివేత

వేప, మోదుగ కలప స్వాధీనం.. సుమారు రూ.లక్ష విలువ

కమ్మర్‌పల్లి (ప్రజాజ్యోతి) నవంబర్ - 18 :

అటవీ సంపదను అక్రమంగా తరలిస్తున్న వారిపై అటవీ శాఖ అధికారులు కోరడా జులిపించారు. కమ్మర్‌పల్లి అటవీ శాఖ పరిధిలోని ఎర్గట్ల మండల కేంద్రం వద్ద బుధవారం ఉదయం అనుమతులు లేకుండా కలపను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు.అటవీ క్షేత్రాధికారి అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం నుంచి ఎర్గట్ల వైపు వస్తున్న ఆరు ట్రాక్టర్లలో అనుమతులు లేకుండా కలపను తరలిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన కలపలో వేప, మోదుగ చెట్ల కలప ఉన్నట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని అంచనా వేశారు.ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కమ్మర్‌పల్లి అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఉప అటవీ క్షేత్రాధికారులు ఏ. శ్రీనివాస్, చంద్రశేఖర్ తెలిపారు. ఈ తనిఖీల్లో అటవీ బీట్ అధికారి పవన్ కుమార్ పాల్గొన్నారు. అటవీ సంపదను కాపాడేందుకు అక్రమ కలప రవాణాపై నిరంతరం నిఘా ఉంచామని, అనుమతులు లేకుండా కలపను తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.



బాలల ప్రతిభకు పట్టం కట్టిన బాలల దినోత్సవ వేడుకలు

ఫ్యాన్సీ డ్రెస్, ఫుడ్ ఫెస్టివల్‌తో చిన్నారుల సందడి.

. తక్కువ ఖర్చుతో అద్భుత కళాఖండాల తయారీ

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ ఎల్లయ్య.

. విద్యార్థుల చదువు, రాత సామర్థ్యాలపై ప్రత్యేక పరిశీలన

కామారెడ్డి రూరల్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ, వారిలో ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో చిన్న మల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్నారుల ఆటపాటలు, వినూత్న ప్రదర్శనలు, ఉత్సాహభరితమైన పోటీలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.ఈ సందర్భంగా విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఆర్ట్ అండ్ కల్చర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తక్కువ ఖర్చుతో లభించే వస్తువులను ఉపయోగించి అద్భుతమైన కళాఖండాలు, ఆకర్షణీయమైన అలంకరణ వస్తువులను తయారుచేసి తమ సృజనాత్మకతను చాటుకున్నారు. పుస్తకాలకే పరిమితం కాకుండా తమలోని ప్రత్యేక ప్రతిభను ప్రదర్శిస్తూ అందరి ప్రశంసలు అందుకున్నారు.ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి ఎల్లయ్య విద్యార్థుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి వారి ప్రతిభను అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. చదువుతోపాటు సాంస్కృతిక, కళా రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. నళినీదేవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమాండ్లు, ఉపాధ్యాయినీ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఎంఈఓ ప్రత్యేక దృష్టి

మండల విద్యాధికారి ఎల్లయ్య బుధవారం ఎంపీపీఎస్ సరంపల్లి, పీఎం శ్రీ చిన్న మల్లారెడ్డి, ఎంపీపీఎస్ తిమ్మాపల్లి పాఠశాలలను సందర్శించి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వయంగా చదివించి, రాయించి వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు ఏ స్థాయిలో చదువుతున్నారు, రాయడంలో ఎంతవరకు నైపుణ్యం సాధించారనే అంశాలను పరిశీలించారు.అదేవిధంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ఎఫ్ఆర్ఎస్ విధానం ద్వారా తనిఖీ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును కూడా పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.ఈ పర్యటనలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీ చిరంజీవి పాల్గొన్నారు.

ముదిరాజ్ స్మశాన వాటిక కొరకు 20.గుంటల ప్రభుత్వ భూమి కేటాయించాలి

కోటగిరి, నవంబర్ 18, ప్రజా జ్యోతి.

కోటగిరి గ్రామ ముదిరాజ్ లు స్మశాన వాటిక కొరకు 20 గుంటల ప్రభుత్వ భూమి ఇవ్వాలని బుధవారం నాడు కోటగిరి గ్రామంలోని పోచారం కాలనీ చెందిన ముదిరాజులు ధర్నా నిర్వహించి తహసీల్దార్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దుబాస్ రాములు మాట్లాడుతూ కోటగిరి గ్రామ ముదిరాజుల కొరకు స్మశాన వాటికకు 20 గుంటల ప్రభుత్వ భూమి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడుస్తున్నా భౌతిక దేహాన్ని పూడ్చి పెట్టడానికి స్మశాన వాటిక లేకపోవడం విచారకరమైన విషయమని ఆయన తెలిపారు. తహసిల్దార్ గారు స్పందించి ప్రభుత్వ భూమి గుర్తించి ముదిరాజుల కొరకు స్మశాన వాటికకు 20 గుంటల ప్రభుత్వ భూమి కేటాయించాలని ఆయన తెలిపారు. సిపిఐ కోటగిరి మండల కార్యదర్శి ఏ విటల్ గౌడ్ ధర్నాకు సంపూర్ణ మద్దతు తెలిపి ముదిరాజులకు స్మశాన వాటిక కొరకు ప్రభుత్వ భూమి కేటాయించె వరకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కలిసి ఐక్యంగా ఉండాలని ఆయన ముదిరాజులకు సూచించారు. ఈ ధర్నా కార్యక్రమంలో నల్ల గంగాధర్, కప్ప గణేష్, పడిగే సాయిబాబా, సంఘని వినోద్, హనుమాన్లు, దుబాస్ సాయిలు, నల్ల సాయిలు, రాజు, సావిత్రి, బాలామణి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో బతుకమ్మ ఆటలతో నిరసన

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కామారెడ్డి /జిల్లా ఆసుపత్రిలో బతుకమ్మ ఆటపాటలతో నిరసన తెలిపిన శానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ గార్డ్ ఆస్పత్రి కార్మికులు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు పి. బాలరాజ్. మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు మరియు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి. ఎల్ దశరథ్ మాట్లాడుతూ కనీస వేతనం 26,000/- ఇవ్వాలని పని భద్రత పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం పగడ్బందీగా అమలు చేయాలని అదేవిధంగా కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి 1000 పడకలు కేటాయించాలని కలిసవేతనాలు లేక పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని సుప్రీంకోర్టు జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని వారన్నారు. కామారెడ్డి జిల్లా ఆస్పత్రి కి నలుమూలల నుండి పేద మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం రావడం జరుగుతుందని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వము వెంటనే జిల్లా ఆసుపత్రికి వేయి పడగల ఆసుపత్రిగా కేటాయించాలని ప్రతీ కార్మికునికి కనీస వేతనం 26,000 ఇవ్వాలని అదేవిధంగా ఆస్పత్రిలో సంఖ్యను పెంచాలని కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆసుపత్రి సిబ్బంది బతుకమ్మ ఆటపాటలతో నిరసన తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ. జిల్లా అధ్యక్షులు బాల్ రాజు ఏ ఐ టి యు సి కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి.ఎల్. దశరథ్ జిల్లా నాయకులు



ఎం ప్రవీణ్ ప్రభుత్వ ఆసుపత్రి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాస్ ఎం డి రఫీక్. సునీత రజిత పద్మ ఎం లక్ష్మి సావిత్రి లావణ్య భాగ్యలక్ష్మి పద్మ వాసవి. అనిత పూజ సుగుణ శ్యామల పాజియా దశరథ్ గంగాధర్ వీరేందర్ ప్రవంతి రాజేశ్వర్ అజయ్ కార్మికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో ఆర్థిక అక్షరాస్యత సదస్సు

బ్యాంకింగ్ సేవలు, సైబర్ మోసాలపై అవగాహన

బీర్కూర్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి) :

బీర్కూర్ మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు నిర్వహించారు. బాన్సువాడ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో, ఆర్‌బీఐ, డీఈఏ ఫండ్ సహకారంతో, కెనరా బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టీ సంస్థ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.ఈ సందర్భంగా ప్రజలకు పొదుపు ఆవశ్యకత, బ్యాంకుల్లో అందుబాటులో ఉన్న వివిధ సేవలు, బ్యాంకింగ్ లావాదేవీల విధానాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏటీఎం వినియోగం, డిజిటల్ చెల్లింపులు, బీమా పథకాలు, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల ప్రయోజనాలు, దరఖాస్తు విధానాలను తెలియజేశారు.ప్రతి ఒక్కరూ ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంపొందించుకొని, బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వొట్లం రమేష్, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, బీర్కూర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజేందర్ నాయక్, ఆర్డీఓ ఉమేష్, అసిస్టెంట్ మేనేజర్ భాను, నరేష్, హన్మాండ్లు, కౌన్సిలర్లు పర్వయ్య, లక్ష్మ గౌడ్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళలు కిందపడితేనే బస్సు ఆపుతారా?

పెర్కిట్--మోర్తాడ్ ఆర్టీసీ బస్సులో డ్రైవర్ నిర్లక్ష్యం?

ఫుట్‌బోర్డుపైనే ప్రయాణికులు ఉండగా బస్సు వేగంగా కదలిక..

మహిళా ప్రయాణికులకు గాయాలు, తీవ్ర ఇబ్బందులు





మోర్తాడ్,నవంబర్18(ప్రజాజ్యోతి):

ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోందా? పెర్కిట్--మోర్తాడ్ మార్గంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సులో మెటపెల్లి డిపో ఒక డ్రైవర్ వ్యవహరించిన తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రయాణికులు బస్సులో పూర్తిగా ఎక్కకముందే, కొందరు ఫుట్‌బోర్డుపై ఉండగానే డ్రైవర్ బస్సును అధిక వేగంతో ముందుకు కదిలించడంతో ఓ మహిళా ప్రయాణికురాలి కాలికి దెబ్బ తగిలినట్లు సమాచారం. మరో మహిళ బస్సు మెట్ల వద్ద ఉండగా, బస్సును ఆపాలని, ప్రయాణికులు లోపలికి వెళ్లే వరకు వేచి ఉండాలని కోరినట్లు తెలిసింది.అయితే, మహిళా ప్రయాణికురాలు అభ్యంతరం వ్యక్తం చేయగా, 'కింద పడితేనే బస్సు ఆపుతా' అన్నట్లుగా డ్రైవర్ సమాధానం ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సమాధానం డ్రైవర్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రయాణికుల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత డ్రైవర్‌పై ఉన్నప్పటికీ, ఇలాంటి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.ఈ ఘటనపై ఆర్టీసీ డిపో మేనేజర్, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సంబంధిత డ్రైవర్‌పై విచారణ చేపట్టాలని, బస్సు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించాలని, తప్పు నిర్ధారణ అయితే తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.మహిళలు కిందపడిన తర్వాత స్పందించడం కాదు.. ప్రమాదం జరగకముందే ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా? అనేది వేచి చూడాలి.

సాలూరలో 96 మందికి చేయూత పింఛన్లు మంజూరు

అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: అల్లె రమేష్

బోధన్:

అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పించి, సామాజిక భద్రత అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సొసైటీ చైర్‌పర్సన్ అల్లె రమేష్ అన్నారు.సాలూర మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ పత్రాలను బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సొక్కం లావణ్య రవి, సొసైటీ చైర్‌పర్సన్ అల్లె రమేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అల్లె రమేష్ మాట్లాడుతూ గ్రామంలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు కలిపి మొత్తం 96 చేయూత పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. పింఛన్ల ద్వారా లబ్ధిదారులకు ప్రతి నెలా ఆర్థిక సహాయం అందడంతో వారి జీవనానికి కొంతమేర భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డికి గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా వార్డు సభ్యులు, ఇల్తేపు శంకర్, అల్లె జనార్దన్, రాజ్ పటేల్, శివకాంత్ పటేల్, గ్రామ కార్యదర్శి ప్రవీణ్, పింఛన్ లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పొగమంచు వేళ అప్రమత్తతే ప్రాణరక్షణ!

అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వాయిదా వేసుకోండి

వేగం తగ్గించండి.. ప్రమాదాలకు దూరంగా ఉండండి

వాహనదారులకు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచనలు

ప్రజాజ్యోతి, బాల్కొండప్రతినిధి:

శీతాకాలం నేపథ్యంలో తెల్లవారుజామున రహదారులపై దట్టమైన పొగమంచు ఏర్పడే అవకాశం ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు. పొగమంచు సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు, రహదారిపై ఉన్న అడ్డంకులు స్పష్టంగా కనిపించక రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు మినహా పొగమంచు సమయంలో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో తెల్లవారుజామున రహదారులపై దట్టమైన పొగమంచు కమ్ముకుంటుందని, ముఖ్యంగా ఉదయం 8 గంటల వరకు దీని తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధిక వేగంతో ప్రయాణించడం, అకస్మాత్తుగా బ్రేకులు వేయడం, ముందు వెళ్తున్న వాహనాలను అధిగమించే ప్రయత్నం చేయడం ప్రమాదాలకు దారితీస్తాయని పేర్కొన్నారు.తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తే వాహన వేగాన్ని తగ్గించి, ముందు వెళ్తున్న వాహనానికి తగినంత దూరం పాటించాలని సూచించారు. పొగమంచు సమయంలో లో-బీమ్ లైట్లు, అవసరమైనప్పుడు ఫాగ్ లైట్లు వినియోగించాలని, హెడ్‌లైట్లు, టెయిల్ లైట్లు, ఇండికేటర్లు సక్రమంగా పనిచేస్తున్నాయో ముందుగానే తనిఖీ చేసుకోవాలన్నారు. వాహనాలకు ముందు, వెనుక రేడియం రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించేవారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగించరాదని, అలసటగా ఉన్నప్పుడు ప్రయాణాలకు దూరంగా ఉండాలని తెలిపారు. పొగమంచు కారణంగా రహదారి కనిపించని పరిస్థితుల్లో సురక్షితమైన ప్రదేశంలో వాహనాన్ని నిలిపి, పరిస్థితులు అనుకూలించిన తర్వాతే ప్రయాణం కొనసాగించాలన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ప్రయాణంలో తొందరపాటు వద్దు.. గమ్యస్థానానికి క్షేమంగా చేరుకోవడమే ముఖ్యం. మీ భద్రతే మీ కుటుంబానికి భరోసా అని ఆయన పేర్కొన్నారు.



రైతులకు శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించాలి

- టేక్రియాల్‌లో పొలంబడి కార్యక్రమం

- ఖేత్ బచావో అభియాన్ సమావేశం

కామారెడ్డి రూరల్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

రైతులు అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకుని, లాభదాయకమైన వ్యవసాయం చేసేలా శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించారు. కామారెడ్డి మండలంలోని టేక్రియాల్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించేందుకు పొలంబడి కార్యక్రమం, ఖేత్ బచావో అభియాన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులు, పంటల సంరక్షణ, సమగ్ర పంట యాజమాన్యం, శాస్త్రీయ సాగు విధానాలపై అధికారులు వివరించారు. పంటల దిగుబడులు పెంచుకోవాలంటే సాగులో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, చీడపీడల నివారణకు విచక్షణారహితంగా మందులు వినియోగించకుండా శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పంటల సాగు చేపట్టాలని రైతులకు అవగాహన కల్పించారు.జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, డీపీడీ (ఆత్మ) మహిత, వ్యవసాయ శాస్త్రవేత్త రేవంత్, ఏడీఏ అపర్ణ, ఏఓ పవన్ కుమార్, ఏఈఓలు దేవేంద్ర, శ్రీనివాస్ రెడ్డి రైతులకు పలు కీలక సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ లలిత చిట్టి బాబు, పీఏసీఎస్ డైరెక్టర్ రాజేష్ కుమార్, స్థానిక రైతులు పాల్గొన్నారు. రైతులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు.



విద్యార్థుల సౌకర్యార్థం రాంపూర్, సుద్దులం తండా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

బోధన్ బస్ డిపో మేనేజర్‌కు బీజేపీ నాయకుల వినతి

బోధన్:

కోటగిరి మండలంలోని రాంపూర్, సుద్దులం తండా గ్రామాలకు విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానిక బీజేపీ నాయకులు బోధన్ బస్ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన డిపో మేనేజర్, ఇప్పటికే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మార్కెలి ప్రకాష్ పటేల్, బోధన్ 33వ వార్డు బీజేపీ కౌన్సిలర్ గుంత గంగాధర్, ఎస్టీ మోర్చా జిల్లా కార్యదర్శి కే. దుర్గా ప్రసాద్, బోధన్ బీజేపీ ఫ్లోర్ లీడర్ కొలిపాక బాలరాజు, కోటగిరి మండల బీజేపీ అధ్యక్షులు ఏముల నవీన్, ప్రధాన కార్యదర్శి వడ్ల శ్యామ్, రుద్రూర్ మండల బీజేపీ అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, నాయకులు పత్తి సతీష్, రోషన్ లాల్ జట్, ఎడ్డేడి చిన్న హనుమండ్లతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములవాడ ఆలయ కోడెలకు సిర్నాపల్లి గ్రామస్తుల పశుగ్రాసం వితరణ

?ఇందల్వాయి, నవంబర్ 18, (ప్రజా జ్యోతి):

మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు బుధవారం సేవాభావాన్ని చాటుకున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలోని కోడెల సంరక్షణార్థం గ్రామస్తులు తమ వంతుగా పశుగ్రాసాన్ని (గడ్డిని) సేకరించి, వాహనంలో వేములవాడకు పంపించారు. ?ఆలయంలోని గోశాల, కోడెల పోషణకు తోడ్పడాలనే సదుద్దేశంతో గ్రామ సభ్యులందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆధ్యాత్మిక సేవలో భాగంగా పశుగ్రాసాన్ని పంపిన సిర్నాపల్లి గ్రామస్తులను పలువురు అభినందించారు.



శెట్టిపల్లి సంగారెడ్డి పీఏసీఎస్‌లో రైతులకు అందుబాటులో యూరియా

ప్రజా జ్యోతి,లింగంపేట్ నంబర్ 18



లింగంపేట్: మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) పరిధిలోని పోల్కంపేట్ సొసైటీ గోదాంలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ మణిగిరి నాగరాజు తెలిపారు.యూరియా అవసరమైన రైతులు ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు ఆధార్ కార్డు, యూరియా బుకింగ్ ఐడీ నంబరుతో పోల్కంపేట్ సొసైటీ గోదాం వద్దకు వచ్చి యూరియా తీసుకోవాలని సూచించారు.అలాగే బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆన్‌లైన్‌లో యూరియా బుకింగ్ ప్రారంభమైందని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సకాలంలో యూరియా పొందాలని ఆయన కోరారు.

నూతన పింఛన్ల పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పోచారం

నస్రుల్లాబాద్ మండలంలో ప్రతి నెలా రూ.1.25 కోట్ల పింఛన్ల పంపిణీ

నస్రుల్లాబాద్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన పింఛన్ల పత్రాలను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే అత్యధికంగా పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. నూతనంగా మంజూరైన పింఛన్లతో కలిపి నస్రుల్లాబాద్ మండలంలో ప్రతి నెలా సుమారు రూ.1 కోటి 25 లక్షల పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించాలని సూచించారు. విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను నిర్మించనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వ సంక్షేమ పాఠశాలల్లోనూ అన్ని రకాల మౌలిక వసతులతో నాణ్యమైన విద్య అందించనున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలలకు గ్రామాల నుంచి విద్యార్థులు వెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ మాజీ చైర్మన్ కాసుల బాలరాజు, ఎమ్మార్వో సువర్ణ, ఎంపీడీవో రవి ఈశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్, మాజీ ఎంపీపీ విట్టల్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్యామ్, మాజీ ఎంపీటీసీ కంది మల్లేష్, వివిధ గ్రామాల సర్పంచులు, పింఛన్ లబ్ధిదారులు, మండల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌పీవీ టీకాలతో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు అడ్డుకట్ట

9 నుంచి 14 ఏళ్ల బాలికలకు టీకాలు.. 53 మందికి వ్యాక్సినేషన్

ప్రజా జ్యోతి,లింగంపేట్ నంబర్ 18

లింగంపేట్ మండలంలో బాలికలకు హెచ్‌పీవీ (ఎ్నాఎ) టీకాలు అందించడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గించవచ్చని వైద్యాధికారి డాక్టర్ హేమబిందు తెలిపారు.లింగంపేట మండలంలోని శెట్పల్లి ,సంగారెడ్డి, పోతాయిపల్లి, పోల్కంపేట్ గ్రామాల్లోని మూడు పాఠశాలల్లో 9 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల 53 మంది బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమబిందు మాట్లాడుతూ.. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రమాదాన్ని సుమారు 90 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని వివరించారు. బాలికల ఆరోగ్య పరిరక్షణకు తల్లిదండ్రులు ముందుకు వచ్చి నిర్దిష్ట వయస్సులో టీకాలు వేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి డివిజన్ సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటనారాయణ, సీపీఎచ్‌సీ రమేష్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

లింగంపేట మైనారిటీ గురుకుల పాఠశాలలో ఆరోగ్య శిబిరం

ప్రజా జ్యోతి,లింగంపేట నవంబర్ 18

లింగంపేట: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా లింగంపేట మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట రాములు మాట్లాడుతూ, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారని తెలిపారు.విద్యార్థులు,ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ క్రాంతి కుమార్, ఉమారాణి, స్వప్న, నర్సింగ్ ఆఫీసర్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.







ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన

ప్రతి గ్రామపంచాయతీలో 60 మంది కూలీలు పనిచేయాలి

గాంధారి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించేందుకు గాంధారి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం అర్హతలు, లబ్ధిదారుల ఎంపిక విధానం, అమలు తీరు తదితర అంశాలపై డీఆర్డీఓ అధికారి దామోదర్ వివరించారు. పథకం అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అర్హులైన కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే విధానాలపై దిశానిర్దేశం చేశారు.అదేవిధంగా ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో కనీసం 60 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ రేణుక చౌహాన్, ఏపీవో మధు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఫ్యాన్సీ నంబర్ల గడువు కుదింపు 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గింపు.. నేటి నుంచే అమలు

గాంధారి , నవంబర్ 18(ప్రజాజ్యోతి)

వాహనదారులు ఫ్యాన్సీ రిజిస్ట్రేషన్ నంబర్లను పొందేందుకు ప్రభుత్వం గడువును కుదించింది. ఇప్పటివరకు 60 రోజులుగా ఉన్న గడువును 30 రోజులకు తగ్గిస్తూ రవాణా శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నూతన నిబంధనలు గురువారం (నవంబర్ 19) నుంచి అమల్లోకి రానున్నాయి.ఈ మేరకు తెలంగాణ రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం బుధవారం ప్రెస్‌నోట్ విడుదల చేసింది. తాత్కాలిక రిజిస్ట్రేషన్ (టీఆర్) జారీ చేసిన తేదీ నుంచి 30 రోజుల్లోగా ఫ్యాన్సీ నంబర్ కోసం రిజర్వేషన్, బిడ్డింగ్, చెల్లింపు ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని వాహన యజమానులకు సూచించింది. నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేసుకోకపోతే ఫ్యాన్సీ నంబర్ పొందే అవకాశం కోల్పోయే పరిస్థితి ఉంటుందని పేర్కొంది.మరోవైపు వాహనాలను విక్రయించే సమయంలో నూతన నిబంధనలపై కొనుగోలుదారులకు అవగాహన కల్పించాలని డీలర్లకు సూచించింది. ఈ మార్పులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం సమీపంలోని ఆర్‌టీఏ కార్యాలయాన్ని సంప్రదించాలని రవాణా శాఖ అధికారులు తెలిపారు.



కిడ్స్ పార్క్ స్కూల్లో చిన్నారుల కోసం మ్యాజిక్ షో

సిరికొండ, ప్రజా జ్యోతి

సిరికొండ మండల కేంద్రంలోని కిడ్స్ పార్క్ స్కూల్లో విద్యార్థుల ఆనందం కోసం ప్రత్యేకంగా మ్యాజిక్ షో నిర్వహించారు. మెజీషియన్ జబ్బర్ తన అద్భుతమైన మేజిక్ ప్రదర్శనలతో చిన్నారులను అలరించారు. వివిధ రకాల మ్యాజిక్ ట్రిక్స్‌ను ప్రదర్శిస్తూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.పాఠశాల కరస్పాండెంట్ ఫర్హీన్ ఉన్నిసా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మ్యాజిక్ ప్రదర్శనలను విద్యార్థులు ఆసక్తిగా తిలకిస్తూ ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు వినోదాన్ని అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పాఠశాల యజమాన్యం మెజీషియన్ ను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ ఆయేషా ఫాతిమా, షహనాస్, విద్యార్థులు పాల్గొన్నారు



విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు రామకృష్ణ

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి) :

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని, శాస్త్రీయ విద్యా విధానానికై పోరాటాల నిర్వహిస్తామని. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు ఇటికాల రామకృష్ణ. ప్రభుత్వం డిమాండ్ చేశారు. బుధవారం ఖానాపూర్ లోని రైస్ మిల్ ఫిట్టర్స్ యూనియన్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ మూడవ కన్వెన్షన్ సూచికగా ఏఐఎస్ఎఫ్ శ్వేత అరుణ పతాకాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోతు రఘురాం ఆవిష్కరించారు. అనంతరం సభను ఉద్దేశించే ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశ విద్యారంగం సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని రామకృష్ణ పేర్కొన్నారు. పోరాటాలు మార్గమే సమస్యలకు పరిష్కారం చూపుతాయన్నారు. విద్య కేంద్రీకరించి పేద విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తీసుకురావాల్సిన కేంద్ర ప్రభుత్వమే ప్రభుత్వ విద్యను నిర్వీరం చేస్తూ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. ఇప్పటికే విద్యను విభజించి, ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ కాషాయకరణ కమర్షియలైజేషన్ చేసిందన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతున్న నేటి తరుణంలో మతోన్మాదాన్ని చాందసవాదాన్ని పసి మెదడులో చూపించే ప్రయత్నం బిజెపి ఆర్ఎస్ఎస్ చేస్తుందన్నారు. శాస్త్రీయ విద్యా విధానం అమలుకై విద్యార్థులు పోరాటాలు నిర్వహించాలన్నారు. భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషన్ జ్ఞానేశ్ కుమార్ బిజెపి ఏజెంట్గా వ్యవహరిస్తూ ఏకపక్ష నిర్ణయాలతోని సర్ ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించడం రాజ్యాంగం ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఇంటర్మీడియట్ విద్య వ్యవస్థను రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విద్యా



విధానాన్ని రద్దు చేసి పాఠశాల విద్యాశాఖలో వీలినం చేయడం అంటే పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమేనని ఆయన ప్రశ్నించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ నిజాంబాద్ జిల్లా గర్ల్స్ మూడవ మహాసభలో నూతన సమితి ఎన్నిక చేశారు. గర్ల్స్ కన్వీనర్ గా కీర్తన, కో కన్వీనర్ గా హాసిని తోపాటు 22 మంది నూతన సమితిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శుభోదు, జిల్లా ఆఫీస్ బేరర్స్, కుశాల్,కిషోర్ చరణ్, సన్నీ, అనూష, వనిత, నిహారిక, సిరి, చందన, సాత్విక, పల్లవి, సంజన, సుగంది, నిత్య, అక్షయ, మనోజ, నాగేష్, ఆకాష్, విష్ణు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల నిర్మాణం కోసం ఒక లక్ష రూపాయల విరాళం అందజేత

ప్రజా జ్యోతి,లింగంపేట నవంబర్ 18

లింగంపేట్ మండల కేంద్రంలో గల శ్రీ సరస్వతి శిశుమందిర్ నూతన భవన నిర్మాణశీ కొరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మర్రి రామ్ రెడ్డి గారు ఒక లక్ష రూపాయలవిరాళం చెక్కు రూపంలో అందజేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ శ్రీ సరస్వతి విద్యాపీఠలు సాంస్కృతిక మరియు సాంప్రదాయమైనటువంటి విద్యను సమాజం పట్ల విలువలతో కూడుకున్న విద్యను అందించడంలో శ్రీ సరస్వతి శిశు మందిరాలు అందిస్తున్నాయని శిశుమందిరాలు భావి భారత పౌరుల జీవితాలను తీర్చిదిద్దే పట్టు కొమ్మల వంటివన్నీ విద్యార్థుల జీవితాన్ని చిన్ననాటి నుంచి పెద్దలపట్ల గౌరవాన్ని సమాజం పట్ల విలువలతో కూడుకున్నటువంటి విద్యను నేర్పుతారని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల జిల్లా ఇంచార్జ్ మర్రి బాపురెడ్డి, లింగంపేట మండల అధ్యక్షులు బొల్లారం క్రాంతికుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కాని దత్తు రాములు,జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్ల రామచందర్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు అంద్యాల ఉదయ్, పట్టణ అధ్యక్షులు నరేష్ భగవాన్, బూత్ అధ్యక్షులు బొల్లు గణేష్, రామకృష్ణ, శిశు మందిర్ అధ్యాపక బృందం, పాఠశాల ప్రబంధకారిని బృందం పాల్గొన్నారు.



చేద్మల్ లో చేయూత పింఛన్ల మంజూరు పత్రాల అందజేత

గాంధారి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చద్మల్ గ్రామ సర్పంచ్ రాథ్ -వెంకట్ అన్నారు. గాంధారి మండలంలోని చద్మల్ గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన 11 పేద కుటుంబాలకు నూతన చేయూత పింఛన్లు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను సర్పంచ్ రాథ్ వెంకట్ అందజేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో, ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పింఛన్ల మంజూరుతో నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా కొంతమేర అండ లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గైని సాయిలు, పంచాయతీ కార్యదర్శి రాధ, పాలకవర్గ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు సీఎం సహాయనిధి అండ

బరంగ్ ఎడ్గిలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బీర్కూర్, నవంబర్ 18(ప్రజాజ్యోతి):

పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని గ్రామ సర్పంచ్ రెంజర్ల అనిల్ కుమార్ అన్నారు. బరంగ్ ఎడ్గి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. పేద ప్రజలకు వైద్య చికిత్సల కోసం ఆర్థిక భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

లబ్ధిదారులు, మంజూరైన మొత్తం:

- కోటగిరి సాయిలు -- రూ.20,000 - బగ్గొండ సాయిలు -- రూ.22,500 ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అన్నం అనిల్, బాలేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగోండ, గ్రామ పెద్దలు అన్నం అంజయ్య, రెంజర్ల అంజు, పేరుగొండ, సాయిలు, పోషెట్టి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దొనకల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షీ.టీమ్స్ అవగాహన సదస్సు

మోర్తాడ్,నవంబర్18(ప్రజాజ్యోతి):

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని దొనకల్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీ. టీమ్స్,ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై బుధవారం రోజున అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ.టీమ్స్ ప్రతినిధుల బృందం అధికారులు విగ్నేష్, సుకన్య లు మాట్లాడుతూ, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్, మహిళల భద్రత, బాలికల రక్షణకు సంబంధించిన పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు ఎదుర్కొనే వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండ, సంబంధిత పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని వారు అవగాహన సదస్సులో తెలియజేశారు. తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112, 8712659795 నంబర్లకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, పోలీస్ అధికారులు వెంటనే స్పందించి మహిళా బాధితులకు, యువతులకు సకాలంలో పోలీసులు విచ్చేసి రక్షణ కల్పిస్తారని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోపారం మోహన్, ఉపాధ్యాయ బృందం సభ్యులు, గంగమణి, సురేష్, రాజ్యారాయణ్,రఘునాథ్,సబిత,కిరణ్,భోజన్నా తదితరులు, పాల్గొన్నారు. విద్యార్థులకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.



రామ్ మఠం భూముల్లో బస్ డిపో నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కౌలు రైతుల ఆందోళన

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి) :

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాల్కల్ రోడ్డులో ఉన్న రామ్ మఠానికి చెందిన భూముల్లో బస్ డిపో నిర్మాణానికి ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు సర్వే చేస్తుండడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. బుధవారం ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు భూమిని కొలవడానికి రాగా, సమాచారం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ “గత 100 సంవత్సరాలకు పైగా మఠానికి ఎకరానికి 5 వేల రూపాయలు కౌలు చెల్లిస్తూ మేము ఈ భూములను సాగు చేసుకుంటున్నా మన్నారు. ఎస్సీ, బీసీ, ఇతర కులాలకు చెందిన భూమిలేని రైతులు 140 సంవత్సరాలుగా ఈ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని తెలిపారు. “ఇప్పుడు ఉన్నట్లుండి మా భూములను లాక్కొని బస్ డిపో పెడతామంటే మా పొట్ట కొట్టినట్టేనని, రైతుల నోట్లో మట్టి కొట్టొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల నర్సారెడ్డి, ఆకుల శ్రీనివాస్, కొత్త రవి, సంపత్, శుభం చందు, బగ్గాలి శివ, బగాలి రాజు, గుప్త రవి, కొత్త రవి, అంబదాస్ రావు, లింగం, శివ కుమార్ తదితరులు పాల్గొని ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు.



అభివృద్ధి ఊసు లేదు బిల్లుల మాట తప్ప

- పట్టణంలో చెత్త, డ్రైనేజీ సమస్య తీర్చలేని కౌన్సిల్

- గత 10 నెలలుగా విన్నవించినా సమస్య జటిలం తప్ప పరిష్కారం లేదు

- సమస్యల పరిష్కారం కోసం కాకుండా బిల్లులు లేపడానికి మున్సిపల్ సమావేశం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

కామారెడ్డి పట్టణ సర్వసభ్య సమావేశం సందర్భంగా బుధవారం పట్టణంలో నెలకొన్న శానిటైజేషన్ సమస్య పరిష్కారం కోసం బీజేపీ కౌన్సిలర్ లు పట్టుబట్టడం జరిగింది. పూర్తి స్థాయి సానిటరీ ఇన్స్పెక్టర్ ను నియమించాలని పట్టుబట్టడం జరిగింది. విషయాన్ని దాటవేసి కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి బిల్లులకు ఆమోదం తెలిపేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ నాయకులు పట్టుబట్టడంతో బీజేపీ సభ్యులు వాకౌట్ చేయటం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్ లు మాట్లాడుతూ నేటి మున్సిపల్ ఎజెండా లో అభివృద్ధి ఊసు లేదనీ కేవలం బిల్లుల మాట మాత్రమే ఉందని, పట్టణంలో చెత్త, డ్రైనేజీ సమస్య తీర్చడంలో కౌన్సిల్ విఫలం అయ్యిందని అన్నారు. గత 10 నెలలుగా విన్నవించినా చెత్త సమస్య జటిలం తప్ప పరిష్కారం చూపలేదని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం కాకుండా బిల్లులు లేపడానికి మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ఉందని అన్నారు. అధికార కాంగ్రెస్, ప్రతి పక్ష రెండు ములాఖాత్ చేసుకొని బిల్లులు ఆమోదం చేసుకుంటున్నాయని అన్నారు.



మోకాళ్ళపై నిల్చోని కార్మికుల నిరసన

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి) :

తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏడవ రోజు నిరసనలో భాగంగా జిజిహెచ్ ముందు కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న వారికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో భాగంగా కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు పెంచాలని, ఆయన డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెల 1వ తేదీన కార్మికుల ఖాతాకు జీతాలు జమ చేయాలని, పండుగ, జాతీయ, సెలవులు ,మెటర్నిటీ సెలవులు ఇవ్వాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు భాగ్యలక్ష్మి, కవిత, భారతి, వెంకటేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



జంగంపల్లి పాఠశాలలో పోలీస్ కళాబృందం

- అవగాహన సదస్సు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

ప్రేమ మోసాలు, మైనర్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి.మూఢనమ్మకాలను వీడి, శాస్త్రీయ ఆలోచనలతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి బిక్కనూర్ మండలం జంగంపల్లి ఉన్నత పాఠశాలలో కామారెడ్డి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటపాటలు, చక్కటి మాటల ద్వారా విద్యార్థులలో చైతన్యం నింపారు. ప్రేమ పేరుతో జరిగే మోసాలు, మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలు, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, బాలలపై జరిగే అకృత్యాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై కళాబృందం సభ్యులు సరళంగా వివరించారు. సోషల్ మీడియాను జాగ్రత్తగా వాడాలని, అపరిచితులను నమ్మి మోసపోవద్దని సూచించారు. చిన్న తప్పులు, చెడు అలవాట్లు భవిష్యత్తును దెబ్బతీస్తాయని, తల్లిదండ్రులు, గురువుల మాట వింటూ క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని తెలిపారు.మూఢనమ్మకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, వాటి పేరుతో జరిగే మోసాలకు గురికావద్దని విద్యార్థులకు సూచించారు. ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మకుండా,హేతుబద్ధంగా,శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి వాస్తవాలను తెలుసుకోవాలన్నారు. విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా షీ టీమ్స్ పనితీరు, మహిళల రక్షణ, పోక్సో చట్టం, మైనర్లపై జరిగే నేరాలు, వాటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డబ్ల్యూపీసీ ప్రవీణ వివరించారు. మానవ అక్రమ రవాణా వల్ల కలిగే ప్రమాదాల గురించి పీసీ రాజేందర్ అవగాహన కల్పించారు. ఆపద సమయంలో భయపడకుండా సైబర్ నేరాలకు 1930కు, మాదక ద్రవ్యాల సమాచారానికి 1908కు, మహిళల రక్షణ కోసం షీ టీమ్ నంబర్ 8712686094కు, అత్యవసర సహాయం కోసం డయల్ 112కు ఫోన్ చేయాలని సూచించారు.కార్యక్రమంలో పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ యు. శేషారావు, పీసీ ప్రభాకర్, బిక్కనూర్ ఏఎస్ఐ ఆర్.వి. వెంకట్రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాచారి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా ముగిసిన బాల్కొండ ముప్కాల్ ఉమ్మడి మండలాల క్రీడోత్సవాలు

ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్

విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేత

ముప్కాల్, ప్రజాజోతి నవంబర్ 18

ముప్కాల్, బాల్కొండ ఉమ్మడి మండలాల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు మూడు రోజుల పాటు విద్యార్థుల ఉత్సాహం, క్రీడా స్ఫూర్తి, ఉత్కంఠభరిత పోటీల నడుమ ఘనంగా ముగిశాయి. ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో ఉమ్మడి మండలాల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు.మూడు రోజుల పాటు జరిగిన ఈ క్రీడా పోటీల్లో విద్యార్థులు వివిధ క్రీడా విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటుకున్నారు. మైదానంలో విద్యార్థుల కేరింతలు, క్రీడాకారుల ప్రతిభతో క్రీడోత్సవాల ప్రాంగణం సందడిగా మారింది.క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో క్రీడలు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యకరమైన జీవన విధానానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ, సమయపాలనతో పాటు స్నేహభావం, ఐకమత్యం పెంపొందుతాయని వివరించారు.ప్రస్తుత కాలంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు ఎక్కువగా అలవాటు పడుతున్నారని, యువత చెడు వ్యసనాలకు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విలువైన విద్యార్థి జీవితాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చని పేర్కొన్నారు. క్రీడల్లో సాధించిన విజయాలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మార్గం చూపుతాయని తెలిపారు.అనంతరం మూడు రోజుల పాటు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి ముత్యాల సునీల్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యాశాఖ ప్రతినిధులు, గ్రామ అభివృద్ధి కమిటీ, ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు క్రీడోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, నిర్వాహకులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.



19 నుండి- ఇందిరమ్మ బీమా - నూతన పెన్షన్లు - బతుకమ్మ చీరల పంపిణీ పథకాలు ప్రారంభం

- ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు గ్రామపంచాయతీకి విచ్చేసి సద్వినియోగం చేసుకోవాలి... - మోర్తాడ్ (ఈ.వో) కార్యదర్శి సైపుద్దిన్ వెల్లడి...

మోర్తాడ్,నవంబర్18(ప్రజాజ్యోతి):




రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19,నుండి ఇందిరమ్మ ఆరోగ్య బీమా పథకం, నూతన పెన్షన్ల పంపిణీ, బతుకమ్మ చీరాల పంపిణీ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని, ఇట్టి పథకాలను మోర్తాడ్ గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మోర్తాడ్ గ్రామపంచాయతీ (ఈ.వో) కార్యదర్శి సైపుద్దిన్ బుధవారం రోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. ఇందిరమ్మ ఆరోగ్య బీమా పథకం కోసం రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్క కుటుంబం ఐదు లక్షల బీమా ప్రభుత్వం అమలు చేసిందని, అట్టి పథకానికి ప్రతి కుటుంబ లబ్ధిదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని గ్రామపంచాయతీకి వస్తే, గ్రామపంచాయతీ అధికారులు ప్రభుత్వం జారీ చేసిన నిబంధన మేరకు దరఖాస్తులను గ్రామపంచాయతీలో స్వీకరిస్తారని కార్యదర్శి వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన పెన్షన్లను సైతం మంజూరైన వారికి మాత్రమే అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బతుకమ్మ చీరలను సైతం పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రభుత్వ పథకాలను అందజేసే పూర్తి వివరాలను మండల అధికారులు తెలియజేసిన వెంటనే గ్రామ ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. గురువారం రోజు నుండి ఇందిరమ్మ బీమా పథకం ప్రతి కుటుంబ సభ్యులు చేసుకోవాలని కార్యదర్శి సైపుద్దీన్ కోరారు.

చెరుకు రైతులకు టన్నుకు 5000 ధర ప్రకటించాలి

- టన్నుకు బోనస్ తో కలిపి 5,000 ధర ప్రకటించాలి

-సి డి సి చైర్మన్ మహమ్మద్ ఇర్షదుద్దీన్

సదాశివనగర్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)



చెరుకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, చెరుకు పంటకు ప్రస్తుత ధరకు అదనంగా బోనస్ తో కలిపి టన్నుకు 5,000 రూపాయల ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరుతూ బుధవారం కామారెడ్డి కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సి.డి.సి చైర్మన్ మహమ్మద్ ఇర్షదుద్దీన్ ఆధ్వర్యంలో చెరుకు రైతుల ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర షుగర్ అండ్ కేన్ కమిషనర్ నర్సిరెడ్డి. ని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సాగు ఖర్చులు, ఎరువులు, కూలీల ఖర్చులు, రవాణా వ్యయం పెరుగుదల తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా చెరుకు పంటకు మద్దతు ధర పెంచడంతో పాటు, అదనంగా బోనస్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.చెరుకు రైతులకు తగిన గిట్టుబాటు ధర లభించినప్పుడే చెరుకు సాగు కొనసాగుతుందని, రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ప్రతినిధి బృందం పేర్కొంది. రైతుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో సి.డి.సి చైర్మన్, సర్పంచ్ నర్సింలు. మాజీ ప్యాక్స్ చైర్మన్ సదాశివ రెడ్డి. సీనియర్ నాయకులు పైడి జనార్ధన్. ఆకుల సిద్ది రాములు. ఆకుల విఠల్. బొలిపెల్లి మహేందర్ రెడ్డి. శెకెల్లి బాల్ రాజు. సంకరి రాజలింగం. ఆకుల గంగరాజం. బక్కన్న గారి భాస్కర్. రాంశెట్టి నర్సింలు. కాలమల్ల అశోక్. చెరుకు రైతులు మరియు రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్ వో

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి) :

నగరంలోని గౌతమ్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని, టీకాల అర్హుల జాబితా లిస్టును, సెషన్ ప్లాన్ , డ్రాప్ అవుట్ పిల్లల జాబితాను, పరిశీలించి వంద శాతం వ్యాధినిర్ధక టీకాలను ఇవ్వాలని అన్నారు. తప్పిపోయిన ప్రతి పిల్లాడిని ఆశ వ్యక్తిగతంగా పర్యవేక్షించి టీకాలు ఇవ్వాలి అన్నారు. డి ఫ్రీజర్, ఐఎల్ఆర్ ను చూసి, కోల్డ్ చైన్ నిర్వహిస్తూ, టెంపరేచర్ రికార్డు చేయాలన్నారు. ఆసుపత్రిలో జరిగే ప్రసవాలు, గర్భిణీ స్త్రీల నమోదు రిజిస్టరు, ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీల రికార్డులను పరిశీలించి 100 శాతం ఆస్పత్రి ప్రసవాలు జరగాలని, ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీలను ముందుగానే ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణకు 14 ఏళ్ల బాలికలకు హెచ్పీవీ టీకాలను అర్హులైన బాలికలు అందరికీ ఇవ్వాలని, తల్లిదండ్రులకు టీకాపై అవగాహన కలిగించాలని, పెండింగ్ లో ఉన్న టీకాలను మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ ఆరోగ్య మహిళ ద్వారా జీవనశైలి వ్యాధుల నియంత్రణ కోసం మరియు మహిళల ఆరోగ్య కోసం పరీక్షలు నిర్వహించాలన్నారు. ల్యాబ్ రికార్డులు, శాంపుల్ రిపోర్టులు, నాకు రిజిస్టర్, రిజిస్టర్, హెచ్ఎంఐఎస్ రిపోర్ట్ లను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రికార్డులను రిపోర్టులను ఎప్పటికప్పుడు సవరించుకుంటూ నాణ్యమైన సేవలను అందించాలని వైద్యాధికారికి, వైద్య సిబ్బందికి తెలియజేశారు. తనిఖీ సమయంలో ఆస్పత్రి వైద్యాధికారిని మైత్రి, ఫార్మసిస్టు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.



యు ఆర్ టి పి రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణ జ్యోతి మీడియా సమావేశం

ఆర్మూర్,(ప్రజా జ్యోతి) నవంబర్18:

ఆర్మూర్ నియోజకవర్గ కేంద్రంలోని యు ఆర్ టి పి రాష్ట్ర అధికార ప్రతినిధి నియోజకవర్గ ఇన్చార్జ్ కొరపాటి అరుణ జ్యోతి మాట్లాడుతూ మీడియా సమావేశం ఏర్పాటు చేసి పత్రిక మిత్రులకు అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ మీడియా సమావేశం ఎందుకు ఏర్పాటు చేయడం జరిగింది. అని వివరిస్తూ ఈ సమావేశం ఏర్పాటు చేయడానికి రాష్ట్ర అధ్యక్షుడు బద్ధం నర్సారెడ్డి, ఆర్మూర్ ఇంచార్జ్ మహిళా అధ్యక్షులు కూరపాటి అరుణజ్యోతి మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్యే ఎలక్షన్లలో నేను పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆర్మూర్ నియోజకవర్గానికి ప్రజలకు సేవ చేయడానికి, ప్రజల సమస్యలను గురించి తెలుసుకోవడానికి ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని నేను ఒక ఆడబిడ్డగా మీరు ఆహ్వానిస్తే అందరు కూడా సహకరిస్తే ప్రజలకు ఇప్పుడున్న రాజకీయం ఎలా ఉందంటే ఎలక్షన్లు వస్తేనే ప్రజలు గుర్తుకు వస్తున్నాను ఎలక్షన్ టైం లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను ఆదమరచి ప్రజలకు అన్యాయం చేస్తున్నారని కూరపాటి అరుణజ్యోతి ఆరోపించారు.రానున్న ఎమ్మెల్యే ఎలక్షన్లలో ఇప్పటికైనా ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె మీడియాతో తెలిపారు.



రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి) :

రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి కోసం పాటుపడతానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని 34, 39వ డివిజన్లలో బుధవారం రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో కేంద్ర నిధులతో అభివృద్ధి కొనసాగుతుందన్నారు. కార్పొరేషన్ లో ఇటీవల కేటాయించిన 20 లక్షల నిధులతో పాలు డివిజన్లలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫండ్ కేటాయించాలని, దీంతో మరిన్ని పనులు ముందుకు సాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, నాయకులు సాయిరాం, పవన్ ముందడ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

.మిర్చి కంపౌండ్ లో పాఠశాల ఆకస్మిక తనిఖీ

నగరంలోని మిర్చి కంపౌండ్ లో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన చేస్తుండగా పరిశీలించారు. అయితే మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా నాణ్యత ఉండాలని



నిర్వాహకులకు సూచించారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల నిర్మాణం కోసం ఒక లక్ష రూపాయల విరాళం అందజేత

ప్రజా జ్యోతి,లింగంపేట నవంబర్ 18

లింగంపేట్ మండల కేంద్రంలో గల శ్రీ సరస్వతి శిశుమందిర్ నూతన భవన నిర్మాణశీ కొరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మర్రి రామ్ రెడ్డి ఒక లక్ష రూపాయలవిరాళం చెక్కు రూపంలో అందజేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ శ్రీ సరస్వతి విద్యాపీఠలు సాంస్కృతిక మరియు సాంప్రదాయమైనటువంటి విద్యను సమాజం పట్ల విలువలతో కూడుకున్న విద్యను అందించడంలో శ్రీ సరస్వతి శిశు మందిరాలు అందిస్తున్నాయని శిశుమందిరాలు భావి భారత పౌరుల జీవితాలను తీర్చిదిద్దే పట్టు కొమ్మల వంటివన్నీ విద్యార్థుల జీవితాన్ని చిన్ననాటి నుంచి పెద్దలపట్ల గౌరవాన్ని సమాజం పట్ల విలువలతో కూడుకున్నటువంటి విద్యను నేర్పుతారని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల జిల్లా ఇంచార్జ్ మర్రి బాపురెడ్డి, లింగంపేట మండల అధ్యక్షులు బొల్లారం క్రాంతికుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కాని దత్తు రాములు,జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్ల రామచందర్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు అంద్యాల ఉదయ్, పట్టణ అధ్యక్షులు నరేష్ భగవాన్, బూత్ అధ్యక్షులు బొల్లు గణేష్, రామకృష్ణ, శిశు మందిర్ అధ్యాపక బృందం, పాఠశాల ప్రబంధకారిని బృందం పాల్గొన్నారు.



ప్రపంచ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ అవగాహన

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కామారెడ్డిప్రపంచ యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ ప్రపంచ యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలు సందర్భంగా కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో అవగాహన కార్యక్రమం మరియు ర్యాలీ నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమాన్ని అనే నినాదంతో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి సవాలుగా మారుతోందని, యాంటీబయాటిక్స్‌తో పాటు యాంటీ ఫంగల్, యాంటీ వైరల్ మందులను కూడా వైద్యుల సూచన మేరకే వినియోగించాలని ప్రజలకు సూచించారు.మందులను వైద్యుల సలహా లేకుండా తీసుకోవడం, అవసరం లేకుండా యాంటీబయాటిక్స్ వినియోగించడం, వైద్యులు సూచించిన చికిత్సను సొంత నిర్ణయంతో మార్చుకోవడం వల్ల మందులపై సూక్ష్మజీవుల్లో నిరోధకత పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు.అలాగే వైద్యులు సూచించిన మందులను వారి ఆదేశాల ప్రకారం మాత్రమే వినియోగించాలని, ఇతరులకు సూచించిన మందులను తీసుకోకూడదని, అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని సూచించారు. యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ అనేది కేవలం మానవ ఆరోగ్యానికే పరిమితం కాకుండా జంతువులు, వ్యవసాయం, పర్యావరణంపై కూడా ప్రభావం చూపుతుందని, దీనిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.నివారణ అనేది ఒక్క వైద్య రంగం బాధ్యత మాత్రమే కాదు. మానవులు, జంతువులు, పర్యావరణ ఆరోగ్యాన్ని సమన్వయంతో కాపాడుకోవడం ద్వారా మాత్రమే ఈ



సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోగలం. ప్రజల్లో అవగాహన పెంపొందించడం, మందులను బాధ్యతాయుతంగా వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు" అని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు "ఏఎంఆర్‌ను అరికడదాం ప్రాణాలను కాపాడుదాం "వన్ హెల్త్ -- వన్ యాక్షన్" అంటూ నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ, హెచ్ఓడీ డాక్టర్ భవాని, ఇన్ఫెక్షన్ కంట్రోల్ సిబ్బంది, వైద్యులు, తదితరుల కామారెడ్డి. ఈ కార్యక్రమంలో రవీందర్ గౌడ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దంత వైద్య సేవలు అభినందనీయం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

విద్యార్థుల దంత ఆరోగ్య పరిరక్షణకు ముందుకు వచ్చిన కామారెడ్డి జిల్లా దంత వైద్యుల అసోసియేషన్ సేవలు అభినందనీయం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె. వెంకటికామారెడ్డి జిల్లాలోని పాఠశాల విద్యార్థుల దంత ఆరోగ్య పరిరక్షణకు ఉచిత దంత వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ మరియు అవసరమైన చికిత్స అందించేందుకు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కామారెడ్డి శాఖ స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె. వెంకటి పేర్కొన్నారు.ఈ మేరకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో కామారెడ్డి జిల్లా దంత వైద్యుల అసోసియేషన్ ప్రతినిధులతో డాక్టర్ జె. వెంకటి సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు నోటి పరిశుభ్రత, దంత ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం ఎంతో అవసరమని తెలిపారు. దంత సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్.బి.ఎస్.కె.వైద్య బృందాలతో సమన్వయం చేసుకుంటూ దంత వైద్యుల అసోసియేషన్ సభ్యులు సేవలు అందించడం ద్వారా జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైతం నాణ్యమైన ఉచిత దంత వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.సామాజిక బాధ్యతగా పేద, నిరుపేద మరియు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత దంత వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కామారెడ్డి శాఖ ప్రతినిధులకు, సభ్యులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరఫున డాక్టర్ జె. వెంకటి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని విద్యార్థుల దంత ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలని కోరారు.

లింగంపేట టీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా రమేష్ రాథోడ్ నియామకం

ప్రజా జ్యోతి,లింగంపేట్ నవంబర్ 18

లింగంపేట: మండల రాజకీయాల్లో టీఆర్ఎస్ పార్టీకి మరింత బలోపేతం కల్పించే దిశగా రమేష్ రాథోడ్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. లింగంపేట మండలం బాణాపూర్ (ఒంటిప్ప తండా) గ్రామానికి చెందిన రమేష్ రాథోడ్‌ను టీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియమించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు పోకల సాయిరాం తెలిపారు.ఈ సందర్భంగా రమేష్ రాథోడ్ నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల రైతు కమిటీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు జైల్ సింగ్‌తో పాటు పలువురు మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





పంటలను పరిశీలించిన వ్యవసాయ డివిజన్ సంచాలకులు

- ఏడీఏ సుధా మాధురి ఏవో భాను శ్రీ

ఏఈఓ రాకేష్ మినుకుల

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

రామారెడ్డి గ్రామంలో పంటలను పరిశీలించిన ఎల్లారెడ్డి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సుధామధురి రామారెడ్డి గ్రామంలో ఎల్లారెడ్డి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పర్యటించి రైతులు సాగు చేస్తున్న వివిధ పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు.

అనంతరం బాణూరి చిన్న గంగారెడ్డి సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను పరిశీలించారు. ఆయిల్ పామ్ పంటలో అంతర పంటగా శనగ సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించి, రైతులు అంతర పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందుతూ తమ ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవచ్చని సూచించారు.అదేవిధంగా రామారెడ్డి రైతు వేదికలో పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను పరిశీలించారు. యాసంగి సీజన్‌లో ఇప్పటికే సాగు చేసిన పంటలు,సాగు చేయబోయే పంటల వివరాలను రైతులు తమ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు తెలియజేసి పంట డేటాలో నమోదు చేసుకోవాలని సూచించారు.రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం సబ్సిడీ పై అందిస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్, మల్చింగ్, పందిరి సాగు, సోలార్ ఫెన్సింగ్ వంటి పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భానుశ్రీ, రామారెడ్డి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్ మినుకుల, రైతులు గంగారెడ్డి, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు ప్రక్రియ ప్రారంభం

- పిఎసిఎస్ సహకార సంఘం ఆధ్వర్యంలో

- పిఎసిఎస్ క్లస్టర్ అధికారి నగేష్ ఆదేశాలతో

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

రామారెడ్డి మండల కేంద్రంలో బుధవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. కొనుగోలు కేంద్రం ప్రక్రియను సుమారు గత నెల 20వ తేదీన ప్రారంభించగా రైతుల అభిప్రాయం మేరకు వ్యవసాయ ప్రాథమిక సంఘం క్లస్టర్ అధికారి నగేష్ స్పందించి మంగళవారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వరి కల్లాలను పరిశీలించారు. తదుపరి రైతులతో మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దు, నమ్మకమైన ధరతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మాత్రమే ధాన్యాన్ని అమ్మాలని పలు సూచనలు చేశారు. అదేవిధంగా ఈ యొక్క కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యాన్ని ఆరబెట్టి తేమశాతం 17 దాటకుండా చూడాలని అదేవిధంగా జాలి పట్టి ప్రతి బస్తాకు 41 కిలో ల చొప్పున తూకం వేయడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ధ్రువీకరించిన తదుపరి ధాన్యాన్ని సేకరించడం జరుగుతుందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే రైతులకు డబ్బులు అందించడం తోపాటు తదుపరి ప్రభుత్వం అందించే బోనస్ కూడా ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్నం వరి ధాన్యానికి బోనస్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలపడం జరిగింది. తదుపరి బుధవారం పిఎసిఎస్ ఆధ్వర్యంలో వారి సిబ్బంది తో తూకం వేయడం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేటలో ఇందిరమ్మ జీవిత బీమా పథకంపై శిక్షణ కార్యక్రమం

ప్రజా జ్యోతి,లింగంపేట్ నవంబర్ 18

లింగంపేట్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన ఇందిరమ్మ జీవిత బీమా పథకంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పథకం అమలు విధానం, అర్హుల ఎంపిక, లబ్ధిదారులకు అందించే ప్రయోజనాలు, సంబంధిత విధివిధానాలపై పంచాయతీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, హెల్ప్‌డెస్క్ ఇన్‌చార్జీలకు అధికారులు అవగాహన కల్పించారు.ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేయాలని సూచించారు. పథకం అమలులో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో మలహరి, ఇతర అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



ఐఆర్‌సీటీసీ టూరిజం

- దక్షిణ మధ్య రైల్వే జోన్ సికింద్రాబాద్ - ఆహ్వాన పత్రిక

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు యాత్రలు, దేశీయ విమాన పర్యాటక ప్యాకేజీలు మరియు రైల్ టూర్ ప్యాకేజీలపై విలేకరుల సమావేశం.ఐఆర్‌సీటీసీ టూరిజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు యాత్రలు, దేశీయ విమాన పర్యాటక ప్యాకేజీలు మరియు ప్రత్యేక రైల్ టూర్ ప్యాకేజీలకు సంబంధించిన వివరాలను తెలియజేయడానికి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నాము.ఈ సందర్భంగా పర్యాటక ప్యాకేజీల ప్రత్యేకతలు, యాత్రా మార్గాలు, ధరలు, ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలు తదితర వివరాలను వెల్లడించనున్నాము.ఈ కార్యక్రమానికి తమ విలువైన సమయాన్ని కేటాయించి, విచ్చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాము.

కార్యక్రమ వివరాలు...!

తేదీ 19 నవంబర్ 2026, గురువారంసమయం ఉదయం 11:30 గంటలకు వేదిక వెయిటింగ్ హాల్ కామారెడ్డి రైల్వే స్టేషన్.మీ అమూల్యమైన సహకారం, మీడియా ద్వారా పర్యాటక ప్యాకేజీల ప్రచారానికి మీ ప్రోత్సాహం అందించాలని కోరుకుంటున్నాము. పి.వి. వెంకటేష్‌అసిస్టెంట్ మేనేజర్ (టూరిజం)ఐఆర్‌సీటీసీ -- దక్షిణ మధ్య రైల్వే జోన్, సికింద్రాబాద్ వారు.





క్యాసంపల్లికి 15 చేయూత పింఛన్లు మంజూరు

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ

కామారెడ్డి రూరల్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ పేర్కొన్నారు. కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి గ్రామానికి నూతనంగా 15 చేయూత పింఛన్లు మంజూరు కావడంతో బుధవారం కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను ఆయన చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా క్యాసంపల్లి గ్రామానికి చెందిన 15 మంది అర్హులైన లబ్ధిదారులకు చేయూత పథకం కింద పింఛన్లు మంజూరు కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఎన్నో రోజులుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు మంజూరు పత్రాలు అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమాజంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఎంపీడీవో హెప్సీబా రాణి, ఎంపీఓ త్రివేద్, క్యాసంపల్లి గ్రామ సర్పంచ్ అడపా శ్యామ్, కార్యదర్శి చంద్రకళ, ఉపసర్పంచ్, నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



లింగయ్యపల్లికి 10 చేయూత పింఛన్లు మంజూరు

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ

కామారెడ్డి రూరల్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)



అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ పేర్కొన్నారు. కామారెడ్డి మండలంలోని లింగయ్యపల్లి గ్రామానికి నూతనంగా 10 చేయూత పింఛన్లు మంజూరు కావడంతో బుధవారం కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 10 మంది అర్హులైన లబ్ధిదారులకు చేయూత పథకం కింద పింఛన్లు మంజూరు కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పింఛన్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పించడంలో చేయూత పింఛన్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఎంపీడీవో హెప్సీబా రాణి, ఎంపీఓ త్రివేద్, లింగయ్యపల్లి గ్రామ సర్పంచ్ రాజయ్య, కార్యదర్శి నవనీత, ఉపసర్పంచ్ శిరీష భూపతి, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ఎంతో విలువైనది

ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలి

అదనపు జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ పేర్కొన్నారు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఈ అమూల్యమైన హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని అదనపు జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ అన్నారు.బుధవారం కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఓటర్ అక్షరాశ్యత కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి పౌరుడు ఓటు హక్కుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఎన్నికల ప్రక్రియలో యువత భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. యువత ప్రజాస్వామ్య విలువలను అర్థం చేసుకొని, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించుకోవాలని, అర్హత సాధించిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఓటు హక్కు ప్రాముఖ్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో యువత పాత్ర వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎల్‌సీ నోడల్ అధికారి మరియు జిల్లా రెవెన్యూ అధికారి పాండు, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్, కామారెడ్డి జిల్లాలోని మూడు అసెంబ్లీ



నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో పట్టపగలు కాదు.. అర్ధరాత్రి చోరీ

దేవి విహార్ అపార్ట్‌మెంట్‌లో ఇంటి తాళం పగులగొట్టి

రూ.25 వేల నగదు అపహరణ

ముసుగులు ధరించి వచ్చిన దొంగలు..

సీసీ కెమెరాల్లో రికార్డైన చోరీ దృశ్యాలు.. వైరల్‌గా మారిన వీడియో

కామారెడ్డి రూరల్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

కామారెడ్డి పట్టణంలో దొంగలు మరోసారి తమ చేతివాటం ప్రదర్శించారు. అర్ధరాత్రి వేళ అపార్ట్‌మెంట్‌లోకి చొరబడిన గుర్తుతెలియని దొంగలు ఓ ఇంట్లో నగదును అపహరించి పరారైన ఘటన పట్టణంలో కలకలం రేపింది. కామారెడ్డి పట్టణంలోని దేవి విహార్ అపార్ట్‌మెంట్‌లో ఈ చోరీ ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే.. దేవి విహార్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు పక్కా ప్రణాళికతో అర్ధరాత్రి సమయంలో అక్కడికి చేరుకున్నారు. ముఖాలకు ముసుగులు ధరించి అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన వారు ఇంట్లోకి చొరబడి రూ.25 వేల నగదును అపహరించారు. అనంతరం ఎలాంటి ఆచూకీ లేకుండా అక్కడి నుంచి పరారయ్యారు.

సీసీ కెమెరాల్లో దొంగల కదలికలు.. వైరల్‌గా వీడియో!

ఈ చోరీ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. ముసుగులు ధరించి అనుమానాస్పదంగా తిరుగుతూ చోరీకి పాల్పడిన దొంగల కదలికలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు, స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయాలని కోరుతున్నారు.

కేసు నమోదు.. దొంగల కోసం పోలీసుల గాలింపు

బాధితుల ఫిర్యాదు మేరకు దేవునిపల్లి ఎస్ఐ రంజిత్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ దొంగలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలోనే నిందితులను గుర్తించి పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. అపరిచిత వ్యక్తుల కదలికలపై అపార్ట్‌మెంట్ వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



భవానీపేటలో సంబరాలు..

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజా జ్యోతి,లింగంపేట్ నవంబర్ 18

లింగంపేట్: మండలంలోని భవానీపేట గ్రామానికి నూతనంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ మంజూరు కావడంతో గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో సంబరాలు నిర్వహించారు.ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, టపాసులు కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గ్రామానికి సహకార సంఘం మంజూరు చేయడంలో కృషి చేసిన ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సొసైటీ ఏర్పాటు వల్ల భవానీపేటతో పాటు చుట్టుపక్కల ఏడు గ్రామాల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని నాయకులు పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ రుణాలు, ఇతర సహకార సేవలు మరింత చేరువ కానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చిన్న మల్లారెడ్డి గ్రామానికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు

74 మందికి చేయూత పింఛన్ల పంపిణీ

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: షబ్బీర్ అలీ

కామారెడ్డి రూరల్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.బుధవారం కామారెడ్డి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి మండలానికి మంజూరైన మొత్తం 281 చేయూత పింఛన్లలో భాగంగా చిన్న మల్లారెడ్డి గ్రామానికి 74 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు సంబంధించిన చేయూత పథకం మంజూరు పత్రాలను కూడా అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, పింఛన్లు పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని షబ్బీర్ అలీ తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భీమయ్యల లక్ష్మి రాజు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. చేయూత పింఛన్లు వృద్ధులకు, దివ్యాంగులకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి పీఏసీఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్, ఎంపీడీఓ హెప్సీబా రాణి, ఎంపీఓ త్రివేద్, మండల అధికారులు భక్తియార్, అరవింద్, తేజ, ఉప సర్పంచ్ కమ్మరి స్వప్న లక్ష్మీనారాయణ, సెక్రటరీ రాజేందర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ధర్మగోని లక్ష్మి రాజగౌడ్, సర్పంచులు రాంకుమార్, మండల అధ్యక్షులు రాజగౌడ్, ప్రవీణ్, సుదర్శన్, రవితేజ గౌడ్, భూమని బాలరాజు, మహేష్ గౌడ్, సీతారాం, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967